
సాక్షి ఖమ్మం

సోమవారం ၊ 1 ၊ జూలై ၊ 2024



మెరుగ్గా వ్యర్థాల నిర్వహణ

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను మెరుగుపరిచేలా మండలానికో యూనిట్ ఏర్పాటుచేసి మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించనున్నారు. 8లో



భారజలం.. అగ్రస్థానం!

అశ్వాపురంలోని మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ఉత్పత్తితో పాటు ఎగుమతిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం వరకు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆతర్వాత తగ్గముఖం పట్టే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్అండ్‌బీ ఎస్ఈగా హేమలత



ఎస్ఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న హేమలత

ఖమ్మంఅర్బన్: రహదారులు, భవనాల శాఖ ఖమ్మం సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా(ఎస్ఈ)గా ఎంబీ.హేమలత ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు ఖమ్మం ఈఈగా ఉన్న శ్యాంప్రసాద్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఉద్యోగ విరమణ చేయడంతో సత్తుపల్లి ఈఈ హేమలతకు ఎస్ఈగా, డీఎస్ఈ వెంకట్ వేణుకు ఖమ్మం ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యాన వారిద్దరు బాధ్యతలు స్వీకరించారు.

వ్యయ వివరాలు సమర్పించండి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ పాటిల్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి పోటీ చేసిన అభ్యర్థులు వ్యయ వివరాలను త్వరగా సమర్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాద్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రాతో కలిసి పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రక్రియలో చివరి దశలో ఉన్నందున అభ్యర్థులు వ్యయ వివరాలను అందజేయాలని సూచించారు. వ్యయ పరిశీలకులు జిల్లాకు వచ్చిన నేపథ్యాన పూర్తి వివరాలు అందజేసి, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, డీసీఓ ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కూడా స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు సరైన స్పందన రాకపోవడంతో మరోమారు పోటీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. నాలుగో తరగతిలో ప్రవేశాలకు గత శుక్ర, శనివారాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లావ్యాప్తంగా కేవలం 51మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యా రు. దీంతో ఈనెల 2వ తేదీన కూడా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు హాజరుకావాలని డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి సూచించారు.

ప్రశాంతంగా డీఏఓ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్(డీఏఓ) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణకు జిల్లాలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటుచేశారు. కాగా, 1,310మంది అభ్యర్థుల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు 545మంది చొప్పున హాజరయ్యారని అధికారులు తెలిపారు.

రామయ్యకు అభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన గావించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కరుణించిన వరుణుడు

ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. పంటల సాగు కోసం రైతులు, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లుగా జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి మొదలైన వర్షం ఆదివారం కూడా కొనసాగింది. ఈ సమయంలో జిల్లాలో సగటున 32 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సీజన్‌లో ఇదే పెద్ద వర్షమని చెబుతుండగా.. జూన్ నెల మొత్తంగా పరిశీలిస్తే సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో సాగులో ఉన్న పైర్లు ప్రాణం పోసుకోగా, సాగు పనులు జోరందుకున్నాయి. ఇక ఇన్నాళ్లు ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. – ఖమ్మంవ్యవసాయం

- జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం
- జూన్‌లో సాధారణానికి మించి వాన
- జోరందుకోనున్న పంటల సాగు



తిరుమలాయపాలెం : ఎదుళ్లచెరువులో కళకళలాడుతున్న పచ్చిరొట్ట పైరు, పక్కన రైతులు పోసిన వరి నారు

తిరుమలాయపాలెంలో అత్యధికం

జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం మొదలైన వాన ఆదివారం రోజంతా కొనసాగింది. జిల్లా అంతటా ముసురు కురుస్తోంది. అత్యధికంగా తిరుమలాయపాలెం మండలంలో 72.2 మి.మీ.ల వర్షపాతం, వేంసూరులో 51.2, ఖమ్మం రూరల్‌లో 46.2, కూసుమంచి మండలంలో 43.8 మి.మీల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 10 నుంచి 40 మి.మీ. మధ్య వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

జూన్‌లో పర్వాలేదు...

జూన్ నెలలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. ఈ నెల సాధారణ వర్షపాతం 124.6 మి.మీ.లు కాగా ఆదివారం రాత్రి వరకు 198.8 మి.మీ.గా నమోదైందని అధికారులు తెలిపారు. ఇందులో శనివారం కురిసిన వర్షమే ఎక్కువగా ఉంది. జిల్లాలోని 16 మండలాల్లో సాధారణానికి మించి, కారేపల్లి, కామేపలి, తల్లాడ, ఏన్కూరు, ఎర్రుపాలెం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూన్‌లో కేవలం 49.5 మి.మీ.ల వర్షపాతమే నమోదు కాగా.. ఈ సారి అంతకు మించి వర్షం కురవడం విశేషం.

పైర్లకు ప్రాణం

రెండు రోజులుగా కురుస్తున్న వానలు ప్రస్తుతం సాగులో ఉన్న పైర్లకు ప్రాణం పోశాయి. ఈ వర్షాలతో వ్యవసాయ పనులను జోరందుకోనుండగా సాగు విస్తీర్ణం పెరుగుతంది. ఈ ఏడాది వ్యవసాయ శాఖ జిల్లాలో 7,03,676 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగవుతాయని అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు 1,41,716 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. అలాగే, పొడి దుక్కుల్లో నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో మరోమారు నాటేందుకు రైతులు సిద్ధమవుతుండగా, వరి, మిరప నారు పోసేందుకు విత్తనాలు సమకూర్చుకుంటున్నారు.



తిరుమలాయపాలెం : మొలకెత్తుతున్న పత్తిమొక్కలు

జూన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	సాధారణం	నమోదు	మండలం	సాధారణం	నమోదు
కారేపల్లి	133.5	110.8	ఏన్కూరు	147.8	131.6
కామేపల్లి	135.2	134.2	కల్లూరు	140.6	211.4
రఘునాథపాలెం	126.4	173.0	పెనుబల్లి	135.1	254.0
ఖమ్మం రూరల్	122.0	209.4	సత్తుపల్లి	153.3	279.0
తిరుమలాయపాలెం	111.0	123.2	వేంసూరు	122.4	264.2
కూసుమంచి	104.0	124.4	తల్లాడ	128.8	131.2
నేలకొండపల్లి	103.9	163.6	వైరా	127.4	148.0
ముదిగొండ	107.6	158.6	బోనకల్	111.6	173.0
చింతకాని	114.8	127.2	మధిర	112.4	146.2
ఖమ్మం అర్బన్	129.5	161.0	ఎర్రుపాలెం	125.5	89.2
కొణిజర్ల	123.0	191.4	జిల్లా సగటు	124.6	166.9

రండి.. బోధించండి

- గతంలో పనిచేసిన గెస్ట్‌లెక్చరర్లకు ఆహ్వానం
- ఈ నెలాఖరు వరకు విధులు నిర్వర్తించాలని సూచన
- ఆతర్వాత మళ్లీ పొడిగించే అవకాశం



ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించే అధ్యాపకుల కొరత ఉండడంతో కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్‌టైం లెక్చరర్లను నియమిస్తున్నారు. ఈనేపథ్యాన గతంలో విధులు నిర్వర్తించిన పార్ట్ టైం, కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈ ఏడాది కూడా బోధన ప్రారంభించగా, గెస్ట్ లెక్చరర్లను సైతం విధుల్లో చేరాలని అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే, జూలై 31వ తేదీ వరకే ఉత్తర్వులు విడుదల కాగా, ఆతర్వాత విద్యాసంవత్సరం కొనసాగించే అవకాశముందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

జిల్లాలో 95మంది

జిల్లాలోని 20 కళాశాలల్లో 58మంది గెస్ట్ లెక్చరర్లు, 8మంది పార్ట్ టైం, 29మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పాఠాలు బోధిస్తున్నారు. వీరిలో పార్ట్‌టైం, కాంట్రాక్ట్ లెక్చరర్లు ఏటా రెన్యువల్ అవుతూ విద్యాసంవత్సరం మొదటి నుంచే కళాశాలలకు హాజరవుతున్నారు. అయితే, గెస్ట్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం ప్రతీ ఏటా ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యాన జిలాల్లోని 58మందికి శనివారం ఉత్తర్వులు అందించగా కొందరు అదేరోజు విధుల్లో చేరారు. మిగతా వారు సోమవారం విధుల్లో చేరే అవకాశముంది. అయితే, వీరికి ఇచ్చిన ఉత్తర్వుల్లో జూలై 31వ తేదీ వరకే విధులు నిర్వర్తించాలని ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈవిషయమై అధికారులను సంప్రదించగా త్వరలోనే మిగతా విద్యాసంవత్సరమంతా కొనసాగించేలా ఉత్తర్వులు అందే అవకాశముందని తెలిపారు. కాగా, ఏటా విద్యాసంవత్సరం మొదలైన రెండు, మూడు నెలల తర్వాత వీరిని రెన్యూవల్ చేసేవారు. ఈ ఏడాది మాత్రం తొలినాళ్లలో కొనసాగింపుపై నిర్ణయం తీసుకోవడంతో జూనియర్ కళాశాలల్లో బోధన సాఫీగా జరగనంది.

2013 నుంచి పనిచేస్తున్నా...



2013 నుంచి గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. గతేడాది బోధించిన వారికి జూలై 31వ తేదీ వరకు విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఆతర్వాత మిగతా విద్యాసంవత్సరమంతా కొనసాగేలా ఉత్తర్వులు అందుతాయని అధికారులు చెబుతున్నారు.

– పాషా, గెస్ట్ లెక్చరర్, కారేపల్లి కాలేజీ

ఈ నెలాఖరు వరకు...



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతేడాది పని చేసిన 58మంది గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈమేరకు వారికి సమాచారం ఇచ్చాం. ఈనెల 31వరకు తర్వాత కొనసాగింపుపై ఉత్తర్వులు అందాల్సి ఉంది.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

ప్రమాదకరంగా బీజేపీ విధానాలు

- పథకాల అమలులో కాంగ్రెస్ వేగం పెంచాలి
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా



మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరంగా పరిణమించాయని... ఆ పార్టీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా ఆరోపించారు. కొద్ది కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెట్టడమే కాక ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే యత్నాల్లో నిమగ్నమైందని పేర్కొన్నారు. ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అజీజ్ పాషా మాట్లాడుతూ బీజేపీపై వ్యతిరేకత మొదలైన నేపథ్యాన బలమైన ప్రతిపక్షంతో ఆ పార్టీ తన విధానాలను మార్చుకోక తప్పని స్థితి ఎదురవుతోందని చెప్పారు. మతోన్మాద చర్యలతో తిరోగమన బాట పట్టక తప్పదని గుర్తించి రాజ్యాంగాన్ని గౌరవిస్తూ లౌకిక వాదాన్ని కాపాడాలని హితవు పలికారు. బీజేపీ వ్యతిరేక ప్రచారంలో కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలిచారని, దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు బలం ఉన్న చోట్ల మోదీ, ఎన్డీఏకు గట్టి ఎదురు దెబ్బ తగిలిందని తెలిపారు. అయితే, కాంగ్రెస్ మరింత విశాల దృక్పథంతో మిత్రపక్షాలను కలుపుకునిపోయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అజీజ్‌పాషా చెప్పారు.

ఆశలకు అనుగుణంగా పథకాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆశలు ఉన్న నేపథ్యాన అభివృద్ధి, సంక్షేమం అమలులో వేగాన్ని పెంచాలని అజీజ్‌పాషా సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను ప్రజలు విశ్వసించిన నేపథ్యాన వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని తెలిపారు. మహిళలకు నెలనెలా రూ.2,500 నగదు బదిలీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో త్వరగా నిర్ణయాలు తీసుకోవడమే కాక రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల విషయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని కోరారు. అయితే, కాంగ్రెస్ రాజకీయ నిర్ణయాలు బీఆర్ఎస్ నిర్ణయాల మాదిరిగానే ఉన్నాయని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

- ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి, పక్కన నాయకులు

మధిర/చింతకాని: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా సిద్ధమైన ప్రణాళికలను అమలుచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిర, చింతకాని మండలాల్లో వివిధ గ్రామాల్లో బీటీ రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిన ప్రజాప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. ఇదేసమయాన అభివృద్ధి సమాంతరంగా జరుగుతుందని వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీలను తూచా తప్పకుండా అమలుచేస్తామని చెప్పారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని తెలిపారు. త్వరలోనే పేదలకు రూ.5 లక్షల వ్యయంతో ఇళ్లు నిర్మించే కార్యక్రమం మొదలుకానుందని, నియోజవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్,, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వివిధ శాఖల అధికారులు చంద్రమౌళి, గణేష్, వెంకటరెడ్డితో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, ఓర్సు వీరభద్రం, అంబటి వెంకటేశ్వర్లు, వంగూరి రమేష్, కూరపాటి రాము, సట్టు వెంకటేశ్వర్లు, చిర్ర సుబ్బయ్య, షేక్ ఆదాం సాహెబ్, అలీంసాహెబ్, గౌషాబీ, కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్, బందెల నాగార్జున్, కన్నెబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ ప్రమాదంపై భట్టి సమీక్ష

మధిర : మణుగూరులోని బీటీపీఎస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై జెన్‌కో(థర్మల్) డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క సమీక్షించారు. మధిరలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన జెన్‌కో(థర్మల్) డైరెక్టర్ లక్ష్మయ్య, చీఫ్ ఇంజనీర్లు రత్నాకర్, బిచ్చన్నను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్, పినపాక, అశ్వాపురం నుంచి ఫైర్ ఇంజన్లను పిలిపించి గంట వ్యవధిలోనే మంటలను అదుపులోకి తీసుకొచ్చామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ప్లాంట్‌ను తనిఖీ చేయడానికి సోమవారం భోపాల్ నుంచి బీహెచ్ఈఎల్ బృందం వస్తోందని చెప్పారు. కాగా, ప్రమాదంపై సమగ్ర నివేదిక అందజేయడమే కాక ప్లాంట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు.

ఇక కొత్త పరికరాలు

- నేటి నుంచి ఎల్–0 స్థానంలో ఎల్–1 వాడకం
- వేలిముద్ర వేసే ప్రతీచోట అమలు తప్పనిసరి



ఖమ్మం సహకారనగర్: పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. లేకపోతే అడుగు ముందుకేస్తున్న సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యాన ప్రభుత్వ పథకాల అమలులో కీలకమైన ఈ – కేవైసీ విధానంలో ఉపయోగించే పరికరాల్లో సోమవారం నుంచి మార్పులు తీసుకొస్తున్నారు. మీ సేవ కేంద్రాలు, సీఎస్‌సీలు, బ్యాంక్‌లు తదితర చోట్ల ఈ–కేవైసీ నిర్ధారణకు వేలిముద్ర తప్పనిసరిగా మారింది. ఈనేపథ్యాన వేలిముద్రలు(బయోమెట్రిక్) దుర్వినియోగం కావొద్దనే ఉద్దేశంతో ఆధార్ సంస్థ(యూఐడీఏఐ) చర్యలు చేపడుతోంది. మీ సేవ, ఇతర కేంద్రాల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఎల్–0 మోడల్ పరికరాలకు బదులు ఎల్–1 పరికరాలను ఉపయోగించాలని ఆదేశించింది. ఈ పరికరాన్ని మార్చకపోతే సోమవారం నుంచి పాతవి పనిచేయవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

160 మీ సేవా కేంద్రాలు

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 160 మీ సేవా కేంద్రాలు కొనసాగుతున్నాయి. అలాగే, 400వరకు కామన్ సర్వీస్ సెంటర్లు ఉండగా, బ్యాంక్‌లు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లోనూ బయోమెట్రిక్ విధానం అమలవుతోంది. ఆయా సెంటర్ల నిర్వాహకులంతా ఇకపై ఎల్–2 పరికరానికి బదులు ఎల్–1 పరికరాన్నే ఉపయోగించాలి. వీటి ధర రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఉందని తెలుస్తోంది. అయితే, ఇది తమకు భారమేనని నిర్వాహకులు చెబుతున్నారు. అయినా తప్పనిసరి కావడంతో కొందరు ఇప్పటికే సమకూర్చుకున్నారు.

భద్రత కోసమే...



వేలిముద్రల భద్రత దృష్ట్యా ఎల్–1 పరికరాన్ని ఉపయోగించాలని యూఐడీఏఐ నుంచి ఆదేశాలు వచ్చాయి. బయోమెట్రిక్ వేసే కేంద్రాల్లో సోమవారం నుంచి ఎల్–0 పరికరం పని చేయదు. ఈ విషయాన్ని ఇప్పటికే మీ సేవ, సీఎస్‌సీల నిర్వాహకులకు తెలియచేశాం. వారందరూ ఎల్–1 డివైజ్‌ను బిగించుకుంటేనే పని జరుగుతుంది.

– దుర్గాప్రసాద్, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్, ఖమ్మం.

హింసాకాండను ప్రశ్నించరేం..?

- ప్రజాసంఘాలు మౌనం వీడాలి
- మావోయిస్టుల చర్యలపై జిల్లా వ్యాప్తంగా వెలుస్తున్న పోస్టర్లు



ఏజెన్సీ మండలాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తమ ఉనికిని కాపాడుకునేందుకు మావోయిస్టులు ఏర్పాటు చేస్తున్న మందుపాతరలు, బూబీ ట్రాప్‌ల కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ గత రెండు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం జరుగుతోంది. మావోయిస్టుల అరాచకాలపై ప్రజా సంఘాలు, నిజనిర్ధారణ కమిటీలు, మహిళా సంఘాలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని, ఈ హింసాకాండపై ఎందుకు మాట్లాడడం లేదంటూ ఈ పోస్టర్లలో ప్రశ్నించారు. జూన్ 28న తొలిసారి కరకగూడెం మండలంలో ఈ తరహా పోస్టర్లు వెలుగులోకి రాగా.. ఆ తర్వాత వరుసగా ఇల్లెందు, కొత్తగూడెం, దుమ్ముగూడెం మండలాల్లోనూ వెలిశాయి.

ఫొటోలతో సహా..

మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరలతో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన సామాన్య ప్రజలకు సంబంధించిన వివరాలను ఫొటోలతో సహా ఈ పోస్టర్లలో పొందుపరిచారు. మావోయిస్టులు సాగిస్తున్న హింసాకాండ, క్రూరత్వం, దుశ్చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మావోయిస్టుల చర్యలతో ఆదివాసీ, దళిత, గిరిజన వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అయితే ఈ లేఖలు ఎవరు ముద్రించారు.. ఎవరు ప్రచారంలోకి తెచ్చారు.. అనే అంశాలపై స్పష్టత లేదు.

గతంలోనూ పోస్టర్లు.. బ్యానర్లు..

సాధారణంగా జనవరిలో ఆకురాలే కాలం మొదలై జూన్, జూలైలో తిరిగి వానలు జోరందుకునే వరకు మావోయిస్టులు దట్టమైన అటవీ ప్రాంతాలకే పరిమితం అవుతారు. నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాతే అడవుల్లో నుంచి బయటకు వచ్చి మైదాన ప్రాంతాల్లో తమ భావజాల వ్యాప్తి, రిక్రూట్‌మెంట్లతో పాటు సానుభూతిపరులను కలవడం వంటి పనులు చేస్తుంటారు. దీన్ని అరికట్టేందుకు మావోయిస్టులకు కౌంటర్‌గా ఈ పోస్టర్లు వెలిశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతీ వానాకాలం ఆరంభంలో కొన్ని రోజుల పాటు ఈ తరహా పోస్టర్లు, బ్యానర్లు ఏజెన్సీ మండలాల్లో ఆకస్మికంగా ప్రత్యక్షం కావడం రివాజుగా మారింది. గతంలో మావోయిస్టులు మా ఊళ్లలోకి రావొద్దనే ప్రచారాన్ని ఉధృతం చేయగా ఈసారి మావోయిస్టుల హింసాకాండ, ప్రజాసంఘాల మౌనం వీడకపోవడం వంటివి ప్రధాన అంశాలుగా పోస్టర్లను రూపొందించారు.

ములకలపల్లి మండలంలో..

ములకలపల్లి: జిల్లాలోని పలు మండలాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వేస్తుండగా, ఆదివారం ములకలపల్లి మండలంలోనూ వెలిశాయి. మండల కేంద్రంతో పాటు మాధారం, చౌటిగూడెం, కంపగూడెం క్రాస్‌రోడ్, జగన్నాథపురం, పాతగంగారంల్లోని ప్రధాన కూడళ్లలో కరపత్రాలను అంటించడం చర్చనీయాంశంగా మారింది.

సాగుదారులందరికీ ‘రైతుభరోసా’

చింతకాని/బోనకల్: కౌలు రైతులతో సహా పంటలు సాగు చేస్తున్న వారందరికీ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరారు. రైతుభరోసా అమలుపై అన్నదాతలు అభిప్రాయాలు సేకరించేందుకు చింతకానిలోని పీఏసీఎస్ కార్యాలయంతో పాటు బోనకల్ మండలం ముష్టికుంట్ల రైతువేదికలో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్‌కార్డులను ఇవ్వలేదని, రేషన్‌కార్డు ప్రాతిపదికన భరోసా అమలు చేస్తే వేలాది మందికి అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యాన సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇవ్వాలని, బీడు భూములు, గుట్టలు, చెరువు శిఖం భూములకు అమలు చేయొద్దని కోరారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ ఉషారాణి, సొసైటీ చైర్మన్లు కొండపల్లి శేఖర్‌రెడ్డి, బోయినపల్లి వెంకటేశ్వర్లు, సీఈఓలు మారగాని శ్రీనివాసరావు, బోయినపల్లి ఉమామహేశ్వరావు, ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓలు సరిత, పల్లెల నాగయ్యతో పాటు ఏఈఓలు, పీఏసీఎస్‌ల డైరెక్టర్లు త్రివేణి, మాదినేని రవి, నన్నక కోటయ్య, కొల్లి గోవిందరావు, ఇలారపు బాబు, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



బోనకల్ : ముష్టికుంట్లలో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

క్లుప్తంగా

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డిప్యూటీ సీఎం భట్టితో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖలోని అర్చకులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈసందర్భంగా ఆదివారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రాలు అందజేశారు. దేవాదాయ శాఖలోని అర్చక, ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ మంజూరు చేయాలని, సర్వీసు, పదోన్నతుల్లో న్యాయం చేయాలని, రిటైర్డ్ అయిన వారికి గ్రాట్యూటీ, పెన్షన్ చెల్లించడంతోపాటు భద్రాద్రి, కాళేశ్వరం జోన్లలో పనిభారానికి అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య పెంచాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రామారావు, తోటకూర వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు కె.రాధాకృష్ణశర్మతో పాటుదాములూరి వీరభద్రరావు, బి.మురళి, రమణ, ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, హరికృష్ణ, రామకోటేశ్వరరావు, రాందాస్, అనంతాచార్యులు, నాగరాజు, విజయలక్ష్మి, లక్ష్మీ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో కొనసాగుతుండడం గర్వకారణం


మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: దేశ సమగ్రత కోసం నిరంతరం పరితపించి, తృణప్రాయంగా ప్రాణాలను వదిలేసిన శ్యాంప్రసాద్ ముఖర్జీ స్థాపించిన బీజేపీలో కార్యకర్తలు కావటం గర్వకారణమని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా కార్యకర్తలు మొక్కలు నాటాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడగా నాయకులు శ్యాంరాథోడ్, సున్నా రవికుమార్, రవికిరణ్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎదురుగడ్డలో 'అలుగు' ప్రత్యక్షం..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన సోమరాజు ఇంటి ఆవరణలోకి ఆదివారం అటవీ జంతువు అలుగు ప్రవేశించింది. జామాయిల్ తోట నుంచి ఇంటి ఆవరణలోకి రాగా, స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అలుగును తీసుకెళ్లి కిన్నెరసాని అభయారణ్యంలో వదిలారు. కాగా వర్షాలు పడుతున్న సమయంలో అలుగు జంతువులు బయటకు వస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.


అటవీ జంతువు అలుగు

మెరుగ్గా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ

- మండలానికొక యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం
- ప్రభుత్వ స్థలాలు, భవనాలు గుర్తించాలని ఆదేశాలు
- అందుబాటులో లేకపోతే అద్దెకు తీసుకోవాలని సూచన
- నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు...


నేలకొండపల్లిలో యూనిట్ ఏర్పాటుకు అధికారులు పరిశీలించిన భవనం

నేలకొండపల్లి: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను మరింత మెరుగ్గా చేపట్టేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ మండలానికి ఒక ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు సిద్ధమైంది. ప్రభుత్వ భవనాలు, స్థలాలను గుర్తించాలని ఇప్పటికే మండలాల అధికారులకు ఆదేశాలు అందగా.. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఇటీవల పాఠశాలల్లో మహిళా సంఘాల నేతృత్వాన అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటుచేయగా విద్యార్థుల యూనిఫాం బాధ్యతలు, క్యాంటీన్ల నిర్వహణ కూడా వారికి అప్పగించారు. ఇప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల బాధ్యతలు కూడా అప్పగించనుండడంతో ప్రభుత్వంమహిళా సంఘాల్లోని సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

యూనిట్లలో ఏం చేస్తారు?

ప్రభుత్వం మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లలో కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లను కటింగ్ చేసేందుకు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఒక్కో యూనిట్‌కు రూ.16 లక్షలను మంజూరు చేయనున్నారు. ఈ నిధులతో యంత్రాలను కొనుగోలు చేసి కటింగ్ చేయించిన బాటిళ్లు, కవర్లను రీసైక్లింగ్‌కు పంపిస్తారు. ప్రతీ పంచాయతీలలో సేకరించిన కవర్లు, బాటిళ్లను వారానికోసారి యూనిట్‌కు పంపించాల్సి ఉంటుంది. తద్వారా కవర్లు, బాటిళ్ల పేరుకుపోకవడమే కాక శాస్త్రీయ పద్ధతిలో రీ సైక్లింగ్‌కు అవకాశం లభించనుంది.

ప్రభుత్వ భవనాల కోసం అన్వేషణ

ప్రతీ మండల కేంద్రంలో ఏర్పాటుచేయనున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లకు అవసరమైన ప్రభుత్వ భవనాలను ఎంపిక చేయాలని జిల్లా అధికారుల నుంచి మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈమేరకు అధికారులు భవనాల కోసం అన్వేషణ ప్రారంభించారు. పలు మండలాల్లో భవనాలు ఉన్నా సరైన సౌకర్యాలు లేవని తెలుస్తోంది. దీంతో వాటి మరమ్మతులకు సైతం నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇక ప్రభుత్వం భవనాలు లేకపోతే అద్దెకు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు తీసుకుని చిరు వ్యాపారాలు చేస్తుండడంతో సభ్యుల ఆర్థికాభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగడం లేదని గుర్తించినట్లు సమాచారం. ఈనేపథ్యాన తాజాగా విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతలు అప్పగించకుండా క్యాంటీన్ల నిర్వహణకు వారికే కేటాయిస్తున్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ల యూనిట్ల ఏర్పాటుతో అటు కాలుష్యానికి చెక్ పడడమే కాక మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమతారనే భావన వ్యక్తమవుతోంది.

త్వరలోనే ఏర్పాటుకు సన్నాహాలు



ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల స్థాపన త్వరలోనే మొదలవుతంది. మండలానికొక యూనిట్ స్థాపించాలని ఆదేశాలు అందాయి. దీంతో ప్రభుత్వ భవనాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. యూనిట్ల ఏర్పాటు అనంతరం అర్హులైన మహిళా సంఘాలకు ఎంపిక చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం.

– ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ

మెరుగైన వైద్యసేవలందించండి

'స్తంభాద్రి' ఆస్పత్రిని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, మేయర్ నీరజ

ఖమ్మంవైద్యవిభాగం: అత్యాధునిక పరికరాలు, నిపుణుల వైద్య బృందంతో ఏర్పాటు చేసిన స్తంభాద్రి ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం నెహ్రూనగర్‌లో నూతనంగా నిర్మించిన ఆస్పత్రిని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలతో పాటుగా సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాలే కాక ఏపీలోని పలు ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం ఖమ్మం వస్తుంటారని తెలిపారు. వీరికి అత్యాధునిక వైద్యం అందించేందుకు స్తంభాద్రి ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఆస్పత్రి వైద్యబృందం గట్టినేని సురేష్, మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, పేర్ల హర్షతేజ, డొగిపర్తి కృష్ణ సుమంత్ మాట్లాడుతూ సువిశాలమైన స్థలంలో 130 పడకలతో ఆస్పత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వాసులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని వసతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, వివిధ పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, భాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్, గల్లా సత్యనారాయణ, బీ.జే.క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ

- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్, 12 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో డీఏఓ పరీక్షకు వెళ్తున్న అభ్యర్థులు


ట్యాంకర్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: ఆయిల్ ట్యాంకర్, ఆర్టీసీ అద్దె బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన సత్తుపల్లి సింగరేణి బైపాస్‌రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు వంట ఆయిల్‌తో ట్యాంకర్ వెళ్తుండగా, ఖమ్మం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ సమయాన బస్సులో 65 మంది ప్రయాణికులు ఉండగా అద్దాలు పగలడంతో కండక్టర్ రమణకుమారి, డ్రైవర్ వెంకటేష్‌తో పాటు 12 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

నుజ్జునుజ్జయిన ట్యాంకర్ క్యాబిన్

ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. దీంతో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ రామ్ కాలు ఇరుక్కుపోయి చిక్కుకున్నాడు. ఆయనను బయటకు తీసేందుకు స్థానికులు నాలుగు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. కాగా, జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సత్తుపల్లి సీఐ టి.కిరణ్, సింగరేణి పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావుతో పాటు సింగరేణి రెస్క్యూటీమ్ చేరుకుని బస్సును పక్కకు తొలగించి క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పస్పత్రికి తరలించారు. ఆయన కాలికి తీవ్ర గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు. ఆ తర్వాత పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా, సత్తుపల్లిలో ఆదివారం జరిగిన డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షకు హాజరయ్యేందుకు 20 మంది అభ్యర్థులు ఇదే బస్సులో వస్తున్నారు. అయితే, ప్రమాదం కారణంగా ఇల్లెందుకు చెందిన బి.రవి, వేలాద్రి పరీక్షకు హాజరుకాకపోగా, ఇంకొందరు గాయాలతోనే పరీక్ష రాసేందుకు బయలుదేరారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి చేయూత

రూ.62,531 అందజేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు


చికిత్స పొందుతున్న సంపత్ (ఫైల్)

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న విద్యార్థికి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అండగా నిలిచారు. వైద్యఖర్చుల నిమిత్తం జమ చేసిన రూ.62,531ను బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. కారేపల్లి మేర బజార్‌కు చెందిన రామగిరి సంపత్ కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై తాళ్లగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంపత్ అపస్మారక స్థితికి చేరుకోగా ఖమ్మంలో చికిత్స పొందుతున్నాడు. అయితే, సంపత్ తండ్రి రాము ఐదేళ్ల క్రితమే ఆత్మహత్య చేసుకోగా, తల్లి సువర్ణ కూలీ పనులకు వెళ్తూ పిల్లలను చదివిస్తోంది. వైద్యఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేదనే విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, అధ్యాపకులతో పాటు సంపత్ స్నేహితులు, ఇతరుల నుంచి సేకరించిన రూ.62వేలకు పైగా నగదును ఆదివారం అందజేశారు. ఇంకా ఎవరైనా ఆర్థికసాయం చేయాలనుకుంటే 97054 21475(రామగిరి పూర్ణశశికాంత్) నంబర్‌కు ఫోన్‌పే ద్వారా పంపించాలని సంపత్ కుటుంబీకులు కోరారు.

రచ్చకెక్కుతున్న 'ఇల్లెందు'

- మున్సిపాలిటీలో తరచూ ఘర్షణలు, దాడులు
- పాలకవర్గంలో రెండు వర్గాల మధ్య విభేదాలు


మున్సిపల్ కౌన్సిల్‌లో ఘర్షణ పడుతున్న చైర్మన్, వైస్‌చైర్మన్ (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో ఘర్షణలు, దాడులు సాధారణంగా మారాయి. తాజాగా శనివారం కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ జానీపాషాపై చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు చేయి చేసుకున్నారు. గతేడాది చైర్మన్ ఇంటి వద్దకు మాట్లాడేందుకు వెళ్లిన ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావుపై.. చైర్మన్ వెంకటేశ్వరరావు చేయి చేసుకున్నారు. ఐదేళ్ల క్రితం అప్పటి కమిషనర్ రవిబాబుపై దాడి జరగ్గా, కారకులైన ప్రజాప్రతినిధులు, నేతలకు శిక్ష కూడా పడింది. హైకోర్టుకు అప్పీల్ చేసుకుని బెయిల్ మీద బయటకు వచ్చారు. ఇలా పలు సందర్భాల్లో దాడులు, ఘర్షణలు జరుగుతున్నాయి.

మున్సిపాలిటీలో రెండు వర్గాలు

ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్ రెండు వర్గాలు విడిపోయి పరస్పరం ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. చైర్మన్‌ను గద్దె దింపేందుకు క్యాంపు రాజకీయాలు కూడా నడిపారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. అప్పటి వరకు అసమ్మతిగా ఉన్న వైస్ చైర్మన్ జానీ పాషా తనతో ఉన్న కౌన్సిలర్లను కాదని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల అభయంతో కౌన్సిల్ సమావేశానికి డుమ్మా కొట్టగా, అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. దీంతో చైర్మన్‌కు పదవీ గండం తప్పింది. కాగా వైస్ చైర్మన్ జానీపాషాపై అదే చైర్మన్ కౌన్సిల్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలోనే దాడి చేయడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. కౌన్సిల్‌లో అసభ్యంగా మాట్లాడితే తీర్మానం పెట్టి సస్పెన్షన్ చేసే అవకాశం ఉందని, కానీ చేయి చేసుకోవడం చట్ట విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. వైస్ చైర్మన్ సైతం కమిషనర్ రవిబాబు మీద చేయి చేసుకుని మరో నలుగురితోపాటు కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు.

మంత్రి పొంగులేటి ఆరా!

మున్సిపల్ కౌన్సిల్‌లో దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వైస్ చైర్మన్ జానీపాషా స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కేవలం మంత్రి పొంగులేటి అభయంతోనే అవిశ్వాసం సందర్భంగా తనను నమ్ముకున్న కౌన్సిలర్లతో వెళ్లకుండా వీగిపోయేలా కృషి చేశానని, అందుకే తన మీద దాడి చేస్తారా అంటూ.. మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. మువ్వా విజయబాబు వచ్చి మీతో మాట్లాడుతారంటూ మంత్రి ఆయనకు నచ్చచెప్పినట్లు తెలిసింది. కాగా గతంలో అవిశ్వాస తీర్మానం సమయంలో వ్యవహరించిన తీరు, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో తాము ప్రత్యక్షంగా మద్దతు తెలపలేమని జానీపాషాకు తేల్చిచెప్పినట్లు సమాచారం. కాగా దాడి ఘటనపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు ఆరా తీసినట్లు తెలిసింది.

కేటీపీసీలో గ్రేడర్ యంత్రం దగ్ధం


కేటీపీసీలో కాలిపోతున్న గ్రేడర్

టేకులపల్లి: సింగరేణి కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఆదివారం ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీకి చెందిన గ్రేడర్ యంత్రం దగ్ధమైంది. కేటీపీ డంపింగ్‌యార్డు, కోల్‌యార్డులకు వెళ్లే మార్గంలో రోడ్లపై గుంతలు ఉండగా, వాటిలో కొన్ని నెలల క్రితమే మట్టితో కప్పబడిన లోగ్రేడ్ బొగ్గు నింపారు. గ్రేడర్ యంత్రంతో చదును చేస్తున్న క్రమంలో యంత్రం గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో బొగ్గుకు, యంత్రం టైర్లకు మధ్య రాపిడి జరిగి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా గ్రేడర్ యంత్రం దగ్ధమైంది. ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీకి రూ. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు అంచనా. కేటీపీ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

బండరాయితో కొట్టి ఏటీఎం ధ్వంసం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఖానాపురం సెంటర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి బండరాయితో కొట్టి ధ్వంసం చేశాడు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తి తొలుత నగదు డ్రా చేసేందుకు యత్నించి, ఆతర్వాత రాయితో కొట్టినట్లుగా తేలిందని సీఐ భానుప్రకాశ్ తెలిపారు. అయితే, మద్యం మత్తులో చేశాడా, చోరీకి ప్రయత్నించాడా అనేది విచారణలో తేలుతుందని తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన దుద్దుకూరి ఉదయ్‌కిరణ్(24) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆయన శనివారం మధ్యాహ్నం విధుల నుంచి ఇంటికి చేరుకున్నాడు. రాత్రి భోజనం తర్వాత తల్లి వాణిశ్రీ రాత్రి ఇంటి ముందు నిద్రించగా, గదిలోకి వెళ్లిన ఉదయ్ ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఆయన తల్లి ఈ విషయాన్ని గుర్తించింది. కాగా, ఉదయ్ ఆత్మహత్యకు భూతగాదాలు కారణమని తెలుస్తుండగా, స్పష్టత రావాల్సి ఉంది. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన


విజయ మృతదేహం

నేలకొండపల్లి: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, అదనపు కట్నం కోసం ఆమెను భర్తే హత్య చేశాడని ఆరోపిస్తూ బంధువులు ఆదివారం నేలకొండపల్లిలో ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం సదాశివపురం వాసి అవినాష్‌కు సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వాయికి చెందిన విజయతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే, అవినాష్ అదనపు కట్నం కోసం భార్యను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడని, ఇదే విషయాన్ని రెండు రోజుల క్రితం ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పినట్లు తెలిసింది. ఇంతలోనే విజయ కింద పడగా తీవ్రగాయాలయ్యాయని, ఆమెను ఆస్పత్రిలో చేర్పించినట్లు అవినాష్ ఫోన్‌లో చెప్పడంతో బంధువులు ఆదివారం ఉదయం నేలకొండపల్లికి చేరుకున్నారు. అప్పటికే ఆమె మృతి చెందగా, ఆస్పత్రి వద్ద నిరసన తెలపడమే కాక పోలీసుస్టేషన్ ఎదుట సైతం ఆందోళనకు దిగారు. అదనపు కట్నం కోసమే తమ అల్లుడు విజయను హత్య చేశాడని ఆరోపిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఘటనతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొనగా, ఆమె మృతదేహానికి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కూతురిని చూసేందుకు వచ్చి పాముకాటుతో మృతి

నేలకొండపల్లి: కుమార్తెను చూసేందుకు వచ్చిన తల్లి పాముకాటుతో మృతిచెందిన విషాద ఘటన మండలంలోని సదాశివపురంలో ఆదివారం చోటుచేసుకుంది. చింతకాని మండలం నేరడకు చెందిన కోట ఆదెమ్మ(56) శనివారం నేలకొండపల్లి మండలం సదాశివపురంలో ఉంటున్న తన కూతురు గోవిందమ్మ ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం చెట్టు వద్ద చింతచిగురు కోస్తుండగా ఆదెమ్మ కాలిపై పాము కాటు వేసింది. దీంతో ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

మారెళ్లపాడుపై మళ్లీ ఆశలు..

- ఎత్తిపోతల పథకం ఐదు నెలల్లో పూర్తికి కార్యాచరణ
- అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల


మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాంతం

అశ్వాపురం: అశ్వాపురం మండలం బీ.జీ.కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ సమీపాన ప్రధాన కాల్వకు అనుబంధంగా నిర్మించాల్సిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ నుంచి తుమ్మల చెరువు సహా పలు చెరువుల ద్వారా సుమారు 17 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. ఇందు కోసం పంప్‌హౌస్ సమీపాన ప్రధాన కెనాల్‌కు అనుబంధంగా రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి గత ప్రభుత్వం 2023 జనవరి 29న శంకుస్థాపన చేసింది. అయితే, ఇప్పటివరకు పనుల్లో పురోగతి లేకపోగా, గత నెల 27న సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ ట్రయల్ రన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి స్థానిక రైతులు ఎత్తిపోతల పథకం విషయాన్ని తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి గోదావరి నీరు ఇతర ప్రాంతాలకు తరలించే క్రమాన తొలుత స్థానిక రైతులకు సాగు నీరు ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేసి ఐదు నెలల్లో స్థానిక రైతులకు సాగు నీరు అందించాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యాన మంత్రి ఆదేశాలతోనైనా ఎత్తిపోతల పథకం పనులు మొదలవుతాయని, తమ పొలాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశిస్తున్నారు.

క్లుప్తంగా...

టీమిండియాకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: టీ20 ప్రపంచకప్ గెల్చుకున్న టీం ఇండియాకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. 'టీ20 ప్రపంచకప్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన టీం ఇండియాకు అభినందనలు. మీ పట్టుదల, కృషి ఫలించాయి. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ క్షణం. జైహింద్' అని ట్వీట్ చేశారు.

మూడు వారాల్లో 7 వేల కోట్ల అప్పులా?

- సంపద సృష్టించడం అంటే ఇదేనా చంద్రబాబూ?
- వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన అంతా అప్పులమయమని విమర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్ల అప్పు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లుగా సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మంగళవారం అప్పు లేనిదే గడవని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేదలకు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అందచేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. రవిచంద్రారెడ్డి ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఒక్క పథకం అమలు చేయడానికే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మిగతా హామీలను నెరవేర్చాలంటే ఇంకెన్ని కోట్లు అప్పు చేయాల్సి ఉంటుందో రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నా సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని కాల్చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండికి బ్లూ రంగు ఉందనే అక్కసుతో చిరు వ్యాపారిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. సీఎం చంద్రబాబు ఈ దురాగతాలకు అడ్డుకట్ట వేయకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పిల్లలపై పిడుగు!

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలకు ఎసరు

- అప్పు చేసైనా కట్టి తీరాల్సిందేనని యాజమాన్యాల ఒత్తిడి
- షెడ్యూల్ ప్రకారం ఇవ్వాల్సిన రూ.1,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- 2023–24 హాస్టల్ ఖర్చులు, మెస్ చార్జీల కింద ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లకు మంగళం



సాక్షి, అమరావతి: 'మీరు.. పరీక్షలు రాయాలంటే ముందు ఫీజు కట్టండి. చివరి సంవత్సరం పాసైన వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిందే. మెస్, హాస్టల్ చార్జీలు కడితేనే గదులు కేటాయిస్తాం. ప్రభుత్వం ఇచ్చేవరకు చూద్దామంటే కుదరదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇక మీకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశ పడొద్దు. అప్పో.. సప్పో చేసి బకాయిలు తీర్చండి. లేదంటే మీ చదువులకు కచ్చితంగా ఆటంకాలు తప్పవు. ఆ తర్వాత మాది బాధ్యత కాదు...' ఇదీ ఏపీలో డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కాలేజీ యాజమాన్యాల బెదిరింపు ధోరణి! ''గత ఐదేళ్లు మా పిల్లల చదువులు సాఫీగా సాగిపోయాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యా దీవెన కింద ఫీజులతోపాటు ఏడాదికి హాస్టల్, మెస్ ఖర్చులు వసతి దీవెనతో మా ఖాతాల్లో పడేవి. వెంటనే మేం కళాశాలలకు చెల్లించేవాళ్లం. మా పిల్లలకు సరిగా చదువు చెప్పకున్నా, హాస్టల్ బాగోలేకున్నా గట్టిగా ప్రశ్నించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే మళ్లీ అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన దుస్థితి తప్పదని భయమేస్తోంది''తల్లిదండ్రులు ఆవేదన ఇది!

పేర్లు మార్చడంలో ఉన్న ఉత్సాహం అమలులో ఏది?

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యా రంగంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. ఇన్నాళ్లూ ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఖర్చులు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు బకాయిలు ఇంతవరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, కోర్సులు పూర్తి చేసిన వారి చేతికి సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆదుర్దా చెందుతున్నారు. ఏ కళాశాలలో చూసినా ఫీజుల గోలే వినిపిస్తోంది. ఇంతకాలం ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో(వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా అప్పు భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ వాటి అమలు ఊసే విస్మరించింది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్)గా మార్పు చేసింది. షెడ్యూల్ ప్రకారం ప్రతి త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్–మెస్ చార్జీల విషయాన్ని మాత్రం గాలి కొదిలేసింది. నిర్ణీత షెడ్యూళ్ల ప్రకారం ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు రూ.1,300 కోట్లు, హాస్టల్–మెస్ చార్జీల కింద ఏడాది చివరిలో ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు ప్రభుత్వం నుంచి అందకపోవడంతో లక్షలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యార్థుల్లో 'ఫీజుల'కలవరం

ప్రతి పేదింటి విద్యార్థికి ఉన్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఖాతాల్లోనే నేరుగా ఫీజుల మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. ప్రతి త్రైమాసికానికి ముందే షెడ్యూల్ ప్రకటించి నిధులు విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 9.44 లక్షల మంది విద్యార్థులకు రూ.708.68 కోట్లను మార్చిలోనే గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ తర్వాత అనుమతి లభించగా కొంత మంది ఖాతాల్లో నగదు జమైంది. ఇంతలో కూటమి అధికారంలోకి రావడంతో హఠాత్తుగా చెల్లింపులు నిలిపివేశారు.

చదువులపై బాధ్యత లేదా?

పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేసింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. 2017 నుంచి 2019 మధ్య అధికారంలో ఉండగా టీడీపీ ప్రభుత్వం 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1,778 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తూ బాధ్యతను మరిచి వ్యవహరిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు ప్రణాళిక వేస్తున్నట్టు తెలుస్తోంది.

చెల్లింపులపై దుష్ప్రచారం..

వైఎస్సార్ సీపీ హయాంలో 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లు జగనన్న విద్యాదీవెన కింద ట్యూషన్ ఫీజులు చెల్లించారు. ఎన్నికలకు ముందు షెడ్యూల్ ఇచ్చి మరీ నిధులు విడుదల చేసినా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాకుండా నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కుట్రలు చేసింది. విద్యార్థులకు అన్యాయం జరగకూడదని వైఎస్ జగన్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో నిధుల విడుదలకు ఒక రోజు సమయం (పోలింగ్‌కు ముందు) ఇచ్చింది. దీనిపైనా మరోసారి టీడీపీ మద్దతుదారులు కోర్టుకు వెళ్లడంతో కేసు విచారణ జరిగేలోపే ఆ ఒక్కరోజు సమయం కాస్తా గడిచిపోయింది. ఫలితంగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం కొంత మంది ఖాతాల్లో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమైంది. మిగిలిన మొత్తంతో పాటు జూన్‌లో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాన్ని చెల్లించే విషయంపై కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించకపోగా గత ప్రభుత్వంపై నెపం వేసే యత్నం చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1,300 కోట్లు, వసతి దీవెనతో రూ.1,100 కోట్లు చెల్లించకుండా దుష్ప్రచారం చేస్తూ ఎగ్గొట్టేలా వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యాసంస్థ	కోర్సు	ఫీజు
ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ	బీటెక్(ఈసీఈ)	రూ.3,05,000
దామోదం సంజీవయ్య లా వర్సిటీ	ఎల్ఎల్‌బీ(5ఏళ్లు)	రూ.2,45,900
ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ తిరుపతి	ఎంబీఏ(అగ్రి బిజినెస్)	రూ.1,96,460
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్	ఎంబీఏ	రూ.1,83,650
ఏఎన్‌యూ	ఎంఎస్సీ(ఫోరెన్సిక్ కెమిస్ట్రీ)	రూ.1,80,750
శ్రీ కృష్ణదేవరాయ కాలేజీ	బీఎస్సీ(హార్టికల్చర్)	రూ.1,73,090
ఏయూ ఫార్మాస్యూటికల్స్ సైన్స్	ఎంఫార్మా(స్పెషల్)	రూ.1,58,500
చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్	ఫార్మా–డీ	రూ.1,25,000

నేను జగన్‌ను కలవలేదు

- ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలవలేదని, తాను భేటీ అయినట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కొద్ది రోజులుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరులోని తన నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిశారని, పలు రాజకీయ అంశాలపై చర్చించారని వదంతులు వ్యాపించాయి. డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలసి పుష్పగుచ్ఛం అందించినట్లు మార్ఫింగ్ ఫొటోలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి డీకే శివకుమార్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించారు. తాను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయినట్లు కొందరు నకిలీ ఫొటో సృష్టించి ప్రచారం చేస్తున్నారని, తాను ఆయన్ను కలవలేదని చెప్పారు. ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం అని చెప్పారు. ఇలాంటి వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

పేట్రేగిపోతున్న టీడీపీ



హోంమంత్రి నియోజకవర్గంలోని కోటవురట్లలో మహిళలపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కొనసాగుతున్న దాడులు

- ఆస్తుల విధ్వంసాలు, శిలాఫలకాల తొలగింపు, వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం
- పుంగనూరుకు వెళ్లకూడదంటూ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలపై ఆంక్షలు
- టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని అడ్డుకున్న పోలీసులు
- హోం మంత్రి సొంత నియోజకవర్గంలో ఇద్దరు మహిళల దుస్తులు చించేసి దాడి
- ఆళ్లగడ్డలో పోలీస్‌స్టేషన్ సాక్షిగా రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- సీఐ ఎదుటే ప్రేమికుడిని చితకబాదిన వైనం
- కక్ష సాధింపుతో చూసీచూడనట్లున్న సీఎం చంద్రబాబు.. రాష్ట్రంలో రావణ కాష్టం రగిలించడమే టీడీపీ ఉద్దేశం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

భారజలం.. అగ్రస్థానం!

దేశంలోనే మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ముందంజ

- ఉత్పత్తి, ఎగుమతిలో పేరుప్రఖ్యాతులు
- ఇటీవల దక్షిణ కొరియాకు సైతం భారజలం ఎగుమతి
- ఆక్సిజన్-18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ ఉత్పత్తితో విశేష గుర్తింపు
- త్వరలో భారజల కర్మాగారం విస్తరణకు ప్రణాళికలు



మణుగూరు భారజల కర్మాగారంలోని యంత్రాలు

అశ్వాపురం: భారజలం ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మణుగూరు భారజల కర్మాగారం ప్రత్యేక గుర్తింపు కలిగి తలమానికంగా నిలుస్తోంది. భారజల కర్మాగారంలో ఉత్పత్తి అవుతున్న అక్సిజన్ -18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ పరీక్షలు ఇటీవల ముంబై, అమెరికాలో నిర్వహించగా విజయవంతమయ్యాయి. ఎగుమతుల్లోనూ అగ్రస్థానంలో నిలిచిన ఈ కర్మాగారం నుంచి తాజాగా దక్షిణ కొరియాకు భారజలాన్ని ఎగుమతి చేసిన నేపథ్యాన మరింత ప్రత్యేక గుర్తింపు పొందింది.

అటు నదీజలాలు.. ఇటు బొగ్గుగనులు

గోదావరి నది, సింగరేణి బొగ్గుగనులు అందుబాటులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి సమీపాన భారజల కర్మాగారం ఏర్పాటుకు నిర్ణయించింది. మణుగూరు భారజల కర్మాగారం పేరిట 1985లో మొదలైన పనులు 1991లో పూర్తి కాగా భారజలం ఉత్పత్తి ప్రారంభమైంది. గోదావరి నది నుంచి సాధారణ నీటిని స్వీకరించి భారజలంగా తయారుచేయడం ఈ కర్మాగారం ముఖ్య ఉద్దేశం. ఇక్కడ ముడిసరుకుగా బొగ్గు, నీరు ఉపయోగిస్తారు. నాటి నుంచి నేటి వరకు భారజలం ఉత్పత్తిలో దేశంలోని అన్ని కర్మాగారాలకన్నా ముందంజలో నిలుస్తూ.. ఆసియా ఖండంలోనే అత్యధిక భారజలం ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్‌గా పేరు గాంచింది. అంతేకాక భారత భారజల బోర్డు పరిధిలో ఎగుమతుల్లో 60 శాతం మణుగూరు కర్మాగారం నుంచే జరుగుతోంది. ఈ భారజలాన్ని న్యూక్లియర్ రియాక్టర్లు, అణువిద్యుత్ కేంద్రాల్లో ఉపయోగిస్తారు. దీనికి తోడు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్‌లోని వివిధ కర్మాగారాల్లో ఉత్పత్తి అయ్యే భారజలాన్ని మన దేశంలోనే కాక విదేశాల్లోని న్యూక్లియర్, నాన్ న్యూక్లియర్ రంగాల్లో వినియోగిస్తుండగా.. ఔషధాల తయారీ, ఆప్టికల్ ఫైబర్ ఉత్పత్తి, ఆర్గానిక్ ఎల్ఈడీ తెరల్లోనూ వాడతారు. భారజలం ఎగుమతి ద్వారా భారత భారజల బోర్డు చరిత్రలో గత ఏడాది అత్యధికంగా రూ.750 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, మణుగూరు భారజల కర్మాగారం నుంచి ఈనెల 17న దక్షిణ కొరియాకు ఇరవై వేల లీటర్ల(20 టన్నులు) భారజలాన్ని ఎగుమతి చేస్తున్న కంటెయినర్‌ను భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్య కుమార్ ప్రారంభించారు. ఈ కంటెయినర్ శంషాబాద్ విమానాశ్రయానికి అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో దక్షిణ కొరియాకు పంపించారు.

వైద్యరంగంలో ప్రత్యేకత

ఆక్సిజన్-18 ఎన్‌రిచ్‌డ్ వాటర్‌కు వైద్య రంగంలో ప్రత్యేకత ఉంది. కేన్సర్ బాధితులకు చికిత్సలో ఈ వాటర్ ఉపయోగపడుతుంది. పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ(పీఈటీ) స్కానింగ్ ద్వారా దీన్ని కేన్సర్ బాధితుల శరీరాల్లో ప్రవేశపెడితే వ్యాధి కణాలను నిర్ధారించి చికిత్స అందిస్తారు. అంతేకాక శరీరంలో జరిగే జీవ, రసాయన చర్యల అధ్యయనానికి ఈ వాటర్ ఉపయోగపడుతుంది.

త్వరలోనే కర్మాగారం విస్తరణ

భారజల కర్మాగారంలో ప్రస్తుతం ఎక్స్ఛేంజ్ – 1, 2 యూనిట్లు ఉన్నాయి. 185 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మణుగూరు భారజల కర్మాగారంలో మరో 100 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఎక్స్ఛేంజ్ -3 యూనిట్ నెలకొల్పేలా భారజల బోర్డు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ప్రపంచ దేశాల సరసన భారత్



దక్షిణ కొరియాకు పంపించే భారజలం వాహనాన్ని ప్రారంభిస్తున్న భారజల బోర్డు చైర్మన్ సత్యకుమార్(ఫైల్)

దేశంలోనే మొదటిసారిగా ఆక్సిజన్-18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ ఉత్పత్తికి అశ్వాపురం మండలంలోని మణుగూరు భారజల కర్మాగారంలో శ్రీకారం చుట్టారు. పది లీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేసిన ప్లాంట్ నుంచి గత ఏడాది ఉత్పత్తి ప్రారంభించారు. ఇటీవల పరీక్షలు విజయవంతం కావడంతో ప్రపంచంలోనే ఆక్సిజన్-18 ఉత్పత్తి చేస్తున్న ఐదారు దేశాల సరసన భారత్ చేరింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి ఇక్కడి అవసరాలకు ఏటా 30 – 40 లీటర్ల ఆక్సిజన్-18ను దిగుమతి చేసుకుంటుండగా, ఇప్పుడు మణుగూరు కర్మాగారంలోనే ఉత్పత్తి అవుతోంది. ముంబై, అమెరికాలో నిర్వహించిన పరీక్షల్లో ఇక్కడి ఆక్సిజన్-18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ అంతర్జాతీయ ప్రమాణాల కంటే నాణ్యతగా ఉందని నిర్ధారించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ ఆధారంగా ఆక్సిజన్-18 వాటర్ ఉత్పత్తి ప్లాంట్లను పెంచాలని భారజల బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం 150 లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం గల రెండు విభాగాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

తెరుచుకోనున్న జీపీసీఎస్ బంక్

- నిధుల్లో తేడా వ్యవహారంతో ఏడాదిన్నర క్రితం మూత
- మళ్లీ ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు



ములకలపల్లిలోని జీపీసీఎస్ ఫిల్లింగ్ స్టేషన్

ములకలపల్లి: గిరిజన ప్రాథమిక సహకార సంస్థ (జీపీసీఎస్) ఆధ్వర్యాన ములకలపల్లిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ఏడాదిన్నర క్రితం మూతపడగా మళ్లీ తెరిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ములకలపల్లిలో ఏర్పాటు చేసిన బంక్‌ను 2018 నవంబర్ 30న ప్రారంభించగా, 2023 డిసెంబర్ వరకు కొనసాగింది. ఇక్కడ మేనేజర్‌తోపాటు ఆరుగురు ఆపరేటర్లు విధులు నిర్వర్తించేవారు. ప్రభుత్వ శాఖ పరిధిలో నిర్వహిస్తుండడంతో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ లభిస్తుందని వాహనదారులు విశ్వసించడంతో నెలకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత నిధులు గోల్‌మాల్ అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అధికారులు విచారణ చేపట్టగా రూ.95 లక్షల వరకు అవినీతి జరిగినట్లు గుర్తించారని సమాచారం. ఫలితంగా బంక్ మూతపడింది. ఇటీవల జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడంతో బంక్‌ను వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా రూ.24 లక్షల నిధులు మంజూరు కావడంతో త్వరలోనే బంక్‌ను ప్రారంభించనున్నట్లు అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు.

కాజేసిన సొమ్ము రూ. 95 లక్షలు.. రికవరీ రూ. 21 లక్షలు

ఐదేళ్లపాటు నిర్విరామంగా కొనసాగిన బంక్‌లో రూ.95 లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ చేపట్టినప్పటికీ ఏం తేల్చారో మాత్రం వెల్లడించడం లేదు. సంస్థ పెద్దల కనుసన్నల్లోనే దందా సాగిందని, నగదు పలువురి చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఏడాదిన్నర పాటు బంక్ మూతపడగా నిధులు దుర్వినియోగానికి బాధ్యులు, ఎవరి నుంచి రికవరీ చేస్తారు, ఎవరెవరిపై చర్యలు తీసుకోనున్నారనే అంశాలను మాత్రం వెల్లడించకున్నా బంక్ ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా రూ. 21 లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు.

ఐదు రోజుల్లో అందుబాటులోకి...



మరో ఐదు రోజుల్లో బంక్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ఇప్పటికే అనుమతుల కోసం సంబంధిత శాఖలకు లేఖ రాశాం. గతంలో రూ.95 లక్షల నిధుల విషయమై తేడా రాగా, ఇప్పటికే రూ.21 లక్షల రికవరీ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీజిల్, పెట్రోల్ విక్రయానికి సిద్ధమవుతున్నాం.
– లక్ష్మాజీ, జీపీసీఎస్ మేనేజర్, పాల్వంచ

అశ్వారావుపేట ఎస్‌ఐ అదృశ్యం!

- అపస్మారక స్థితిలో మహబూబాబాద్‌లో గుర్తింపు
- పురుగుల మందు తాగి.. 108కు ఫోన్ చేసిన ఎస్సై
- పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ తరలింపు



మహబూబాబాద్ ఆస్పత్రిలో ఎస్సై శ్రీను

అశ్వారావుపేటరూరల్/మహబూబాబాద్‌రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను అదృశ్యమైన ఘటన ఆదివారం కలకలం రేపింది. ఉదయం నుంచి ఆయన రాకుండా పోగా.. రాత్రి 11గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుతున్న సమయాన స్వయంగా ఆయనే 108కు ఫోన్ చేశాడు. దీంతో సిబ్బంది మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన శ్రీను అశ్వారావుపేటలో ఐదు నెలలుగా ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తుండగా, ఆదివారం ఉదయం 8గంటలకు స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత కారు నడుపుకుంటూ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన వద్ద రెండు సెల్ నంబర్లు స్విచ్ఛాఫ్ రావడంతో సిబ్బంది సీఐ జితేందర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన విచారణ చేపట్టగా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయ్యాయని గుర్తించినట్లు తెలిసింది. రాత్రి 10.30 గంటల వరకు కూడా ఎస్‌ఐ ఆచూకీ లభించక సిబ్బంది గాలింపు ముమ్మరం చేశారు. కొద్ది రోజులుగా ఎస్‌ఐపై వస్తున్న అవినీతి ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తుండగా.. స్టేషన్‌లోని సిబ్బందికి, ఎస్‌ఐ మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే సిబ్బంది సైతం జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నాలుగు రోజులు సెలవులో వెళ్లి బుధవారమే విధుల్లో చేరారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులతోనే ఎస్సై ఆవేదన చెందినట్లు ప్రచారం జరుగుతోంది.

పురుగుల మందు తాగి.. 108కు ఫోన్

అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 11గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపాన పురుగుల మందు తాగిన ఎస్సై.. స్వయంగా 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో డీఎస్పీ తిరుపతిరావు, మహబూబాబాద్ రూరల్, గూడూరు సీఐలు సర్వయ్య, బాబురావుతోపాటు 108 సిబ్బంది చేరుకుని ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఎస్సై పరిస్థితి విషమంగా ఉండడంతో అర్ధరాత్రి 12గంటలకు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఈపీ ఆపరేటర్ రాతపరీక్షకు 826 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 100 ఈపీ ఆపరేటర్(ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, పీజీ కళాశాలలో రాతపరీక్ష నిర్వహించారు. గతంలో నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన 828 మందికి గాను 826మంది రాత పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డైరెక్టర్(పా) ఎన్వీకే.శ్రీనివాస్ పరిశీలించారు. అధికారులు బీ.ఆర్.దీక్షితులు, జి.రాంకుమార్‌రావు, వేణుగోపాల్‌రావు, వీ.ఎస్.ఆర్.శాస్త్రి, షాకీర్ మొహినొద్దీన్, జాకీర్, ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం రాత్రి కల్లా ఫలితాలను సంస్థ వెబ్‌సైట్ ద్వారా వెల్లడించగా, 801 మంది క్వాలిఫై అయ్యారు. మిగతా వారిలో ఆరుగురు క్వాలిఫై కాకపోగా, మరో 19 మంది తమ వివరాలను ఓఎంఆర్ షీట్‌లో సరిగ్గా నమోదు చేయకపోవడంతో తిరస్కరించినట్లు సమాచారం. త్వరలోనే మార్కుల ఆధారంగా అర్హుల జాబితా విడుదల చేయనున్నారు.

కేటీపీఎస్ ఏడో దశలో నిలిచిన ఉత్పత్తి

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12వ యూనిట్‌లోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడింది. దీంతో ఉత్పత్తి నిలిపివేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపడుతున్నామని, సోమవారం నాటికి ఉత్పత్తి పునరుద్ధరిస్తామని సీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇద్దరు జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని ఈ అండ్ ఎం విభాగంలో ఇద్దరు ఏజీఎంలకు జీఎంలుగా పదోన్నతి కల్పించి బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బెల్లంపల్లి ఏరియాకు చెందిన మోకాళ్ల తిరుమలరావును కార్పొరేట్ కార్యాలయం ఈఅండ్ఎం జీఎం(సీహెచ్‌పీఎస్)గా, జైపూర్ ఎస్టీపీసీ నుంచి కొండారెడ్డి శ్రీనివాసులును జైపూర్ ఈఅండ్ఎం జీఎంగా కేటాయించారు. ఇన్నాళ్లు ఈఅండ్ఎం జీఎం(సీహెచ్‌పీఎస్)గా పనిచేసిన నవీన్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు.